## క్లుప్తంగా

### ఆశాలకు వేతనాలు చెల్లించాలి

**కడప వైఎస్సార్ సర్కిల్:** ఆశా కార్యకర్తలకు ఇవ్వవలసిన మార్చి నెల వేతనం తక్షణం ఇవ్వాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు యు. మరియమ్మ పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మార్చి నెల ఒకటి, రెండు తేదీలలో ఇవ్వవలసిన ఆశాల వేతనం ఇంతవరకు ఇవ్వకుండా ఆలస్యం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శాంతమ్మ జిల్లా కోశాధికారి అమ్ములు పాల్గొన్నారు.

### మహిళకు సాయం

**కడప కార్పొరేషన్:** రక్షణ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మాసాపేట దొరల సమాధుల తోటకు కాపలా ఉన్న మహిళకు బియ్యం, దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంస్థ అధ్యక్షుడు పి. సంపత్, చైతల్య మాట్లాడుతూ బ్రిటీషు వారి పాలనలో మన జిల్లాకు కలెక్టర్లుగా, ఉన్నతాధికారులుగా పనిచేసిన ఎంతోమంది సమాధులు దొరల గోరీలలో ఉన్నాయని, వాటికి ఎన్నో ఏళ్లుగా కాపలా కాస్తున్న మహిళకు సాయం చేయడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం వారు ప్రహరీకి దేవుని వాక్యాలు రాయించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సీహెచ్ వినోద్, త్యాగరాజు, శ్యాంసన్, దానమయ్య, రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

### వైభవంగా వీరబ్రహ్మేంద్ర స్వామి గ్రామోత్సవం

**చెన్నూరు :** మండలంలోని రామనపల్లె గ్రామంలో తెలుగు సంవత్సరాది ఉగాది పండుగను పురస్కరించుకొని మంగళవారం రాత్రి గ్రామంలోని పురవీధులలో శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి గ్రామోత్సవం గ్రామస్తులు వైభవంగా నిర్వహించారు. మేళతాళాలతో బాణాసంచా పేలుస్తూ గ్రామస్తులంతా స్వామివారి రథోత్సవాన్ని లాగారు. గ్రామోత్సవంలో వీరబ్రహ్మేంద్ర స్వామికి జై.. గోవిందమాంబకు జై నినాదాలు మిన్నంటాయి.

### నేడు ఎర్రగుంట్లకు ఎంపీ

**ఎర్రగుంట్ల :** మండల కేంద్రమైన యర్రగుంట్ల పట్టణంలోని 10,11,12,13,19 వార్డులలో ఎంపీ అభ్యర్థి వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టరు మూలె సుధీర్‌రెడ్డిలు బుధవారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారని వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్, మున్సిపల్ చైర్మన్ ఎ హర్షవర్ధన్‌రెడ్డి తెలిపారు. ఈ వార్డులలో వారితో తాను కూడా ఇంటింటి ప్రచారం నిర్వహిస్తామన్నారు. పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొనాలని ఆయన కోరారు.

### నేడు ఎన్నికల ప్రచారం

**వల్లూరు :** మండలంలోని వల్లూరు పంచాయతీ పరిధిలో బుధవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి వైఎస్‌ఆర్‌సీపీ ఎన్నికల ప్రచారం జరుగుతుందని ఆ పార్టీ మండల కన్వీనర్ అబ్బిరెడ్డి వీరారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయతీ పరిధిలోని సీ కొత్తపల్లె, లింగాయపల్లె, పాత గాలివారిపల్లె గ్రామాల్లో జరిగే ఇంటింటి ప్రచారంలో ఎమ్మెల్యే పీ రవీంద్రనాథ రెడ్డి, ఏపీఎస్ ఆర్‌టీసీ రాష్ట్ర చైర్మెన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి పాల్గొంటారని తెలిపారు.

### నేడు వైద్య శిబిరం

**చాపాడు:** మండల పరిధిలోని అల్లాడుపల్లె, వెదురూరు గ్రామాల్లో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మండల వైద్యాధికారి రాజేష్‌కుమార్ తెలిపారు. అల్లాడుపల్లెలో వైద్యాధికారి కావ్యమాధురి, వెదురూరులో వైద్యాధికారి ఓబులేసు వైద్య శిబిరం ఏర్పాటు చేసి ఆయా గ్రామాల పరిధిలోని ప్రజలకు వైద్య పరీక్షలు చేసి.. మందులు అందజేస్తారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ఆయా గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### నిర్భయంగా ఓటుహక్కును వినియోగించుకోండి

**కొండాపురం :** సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని ప్రొబేషనరీ జమ్మలమడుగు డీఎస్పీ శ్రీ కాంత్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని సమస్యాత్మక గ్రామం అయిన వెంకయ్యకాలవ గ్రామంలో కేంద్ర సాయుధ బలగాలంతో పోలీస్‌లు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడూతూ సార్వత్రిక ఎన్నికల్లో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగే విధంగా ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐ వేణుగోపాల్ పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

### ఘనంగా ఆరాధన ఉత్సవాలు

**బ్రహ్మంగారిమఠం:** శ్రీ పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి శిష్యుడు సిద్దయ్య నాలుగో కుమారుడు పెద్దపీరయ్య స్వామి ఆరాధన ఉత్సవాలు మంగళవారం సిద్దయ్యమఠంలో ఘనంగా నిర్వహించారు. సిద్దయ్యమఠం పీఠాధిపతులు రామకృష్ణయ్య సోదరుల ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా బి.మఠం ఎస్ఐ విద్యాసాగర్ బందోబస్తు ఏర్పాటు చేసారు. పెద్దపీరయ్యస్వామి ఆరాధన సందర్భంగా బుధవారం మధ్యాహ్నం బండలాగుడు పోటీలు ఏర్పాటు చేశారు.

# వైభవంగా ఉగాది వేడుక



విజయదుర్గమ్మ ఆలయంలో రాహుకాల పూజలు నిర్వహిస్తున్న భక్తులు

**కడప కల్చరల్ :** శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో శ్రీ క్రోధి నామ ఉగాది సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. మంగళవారం తెలుగు సంవత్సరం క్రోధి నామ సంవత్సర ఉగాది సందర్భంగా ఆలయంలో విశేష పూజ కార్యక్రమం, సాయంత్రం 6 గంటలకు పంచాంగ శ్రవణం నిర్వహించారు. శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో అమ్మవారికి తెల్లవారుజామున విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం అమ్మవారిని చక్కగా అలంకరించి దీప, దూప, నైవేద్యాలను సమర్పించారు. అనంతరం మంగళవారం నేపథ్యంలో మధ్యాహ్నం 3 గంటల నుండి 4.30 వరకు రాహుకాల పూజలు నిర్వహించారు. ఈ నూతన సంవత్సరం ప్రజలందరికీ విశేషమైన ఆనందాన్ని, సిరి సంపదలను అందించాలని ఆకాంక్షిస్తూ ఆలయ వ్యవస్థాపకులు సుధా మల్లికార్జున రావు, నిర్వాహకులు దుర్గాప్రసాద్ భక్తులకు ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. సాయంత్రం నిర్వహించిన ఈ పంచాంగ శ్రవణ కార్యక్రమానికి భక్తులు విశేషంగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ ఉగాది నుండి శ్రీ రామనవమి వరకు ఆలయంలో ప్రతి రోజు ఉదయం, సాయంత్రం అమ్మవారికి చతుష్షి ఉపచార పూజ విశేషంగా నిర్వహిస్తారు.

**ప్రయాణికులకు ఉగాది పచ్చడి**

**కడప ఎడ్యుకేషన్:** తెలుగు నూతన సంవత్సరం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం(ఆపస్) ఆధ్వర్యంలో కడప ఆర్టీసీ బస్టాండ్ ఆవరణంలో ప్రయాణికులకు ఉగాది పచ్చడి వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆపస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెంకటరామిరెడ్డి తెలుగు క్యాలెండర్ ప్రకారం జరిగే తొలి పండుగ అయిన ఉగాది ప్రత్యేకతను వివరించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కొండారెడ్డి క్రోధి నామ సంవత్సరం విశిష్టతను తెలియచేసి ప్రజలంతా సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ప్రశాంతంగా జీవించాలని ఆకాంక్షించారు. ఆర్టీసీ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఆనందరెడ్డి మాట్లాడుతూ ఉగాది పండగ రోజు సుదూర ప్రాంతాలకు ప్రయాణించే ప్రయణికులకు మా బస్టాండ్ ఆవరణంలో ఉగాది పచ్చడిని అందించడం అత్యంత సంతోషదాయకం అన్నారు. ఆపస్ జిల్లా ఉపాధ్యక్షులు నాగరాజు, నారాయణరెడ్డి, శ్రీనివాసులు, రఘుప్రసాద్, రెడ్డెయ్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**ఎప్పటికప్పుడు కొత్త జీవితం కావాలి**

**కడప కల్చరల్ :** మనిషి ఎప్పటికప్పుడు తన జీవితాన్ని సరికొత్తగా ఉంచుకోవాలని గాఢంగా కోరుకుంటాడని, ప్రకృతి పరిశీలనతో ఇది అలవడిందని వైవీయూ పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య ఎన్.ఈశ్వర్‌రెడ్డి అన్నారు. భారత జాతీయ కళా వారసత్వ సంస్కృతి పరిరక్షణ సంస్థ (ఇంటాక్) ఉగాది వేడుకలను మంగళవారం నగరంలోని మానస ఇన్ సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు.



బస్టాండ్ ఆవరణలో ప్రయాణికులకు ఉగాది పచ్చడి అందజేస్తున్న ఆపస్ నాయకులు

కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ ఉగాది మానవ జీవితాన్ని యేటేటా సమీక్షించుకునేందుకు భవిష్యత్తులో ఉత్తమ మార్గంలో వెళ్లేందుకు అవకాశం కల్పిస్తుందన్నారు. సభాధ్యక్షులు, ఇంటాక్ జిల్లా కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి మాట్లాడుతూ ఉగాది పండుగ సంస్కృతి సంభరితమైనదని, ఈ వారసత్వాన్ని భావితరాలకు అందించే స్ఫూర్తినిచ్చేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. లయన్స్ క్లబ్ జిల్లా అధ్యక్షులు పోతుల వెంకట్రామిరెడ్డి, లయన్స్ క్లబ్ పూర్వ అధ్యక్షుడు డాక్టర్ విద్యాసాగర్ రెడ్డి, ఇంటాక్ పూర్వ అధ్యక్షులు ఎస్.ఎలియాస్‌రెడ్డి, సభ్యులు పోచంరెడ్డి సుబ్బారెడ్డి, కో కన్వీనర్ పీవీ సుబ్బారెడ్డి, పూర్వ కో కన్వీనర్ పాలెం వేణుగోపాల్‌లు మాట్లాడుతూ తెలుగు వారి సంప్రదాయాలు ప్రకృతితో ముడిపడి ఉంటాయని వివరించారు. రాజంపేట ఇంటాక్ చాప్టర్ కో కన్వీనర్ షేక్ అబ్దుల్లా విచ్చేసి తెలుగులో ఉగాది సందేశం అందజేశారు. డాక్టర్ ఆర్.రంగనాథరెడ్డి, డాక్టర్ పుత్తా బాలిరెడ్డి , రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్దన్‌రాజు, లయన్స్ సభ్యులు గౌరీశంకర్, దేవతి రవీంద్రనాథ్, ఇంటాక్ మహిళా సభ్యులు రాణి, అసంతమ్మ, కొండారెడ్డి, రాఘవేంద్రవర్మ తదితరులు కూడా మాట్లాడారు.

**పంచాంగ పఠనం**

టీటీడీ వేదిక్ యూనివర్శిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ రాజేష్ భట్టర్ ఈ సందర్భంగా శ్రీ క్రోధి నామ సంవత్సర పంచాంగ పఠనం చేశారు. స్థానిక అర్చకుడు



కవులను సత్కరిస్తున్న నిర్వాహకులు, అతిథులు

విజయ్‌భట్టర్ బృందం నగర వాసులకు వేదాశీస్సులు అందజేశారు.

**కవి సమ్మేళనం**

ఈ సందర్భంగా 20 మందికి పైగా కవులు ఉగాదిపై కవితాగానం చేసి ఆకట్టుకున్నారు. నిర్వాహకులు వారిని సత్కరించారు. ఈ సందర్భంగా చిన్నారులకు సంప్రదాయ వస్త్రధారణ పోటీ నిర్వహించి బహుమతులు అందజేశారు.

**సత్యదేవుని ఆలయంలో పూజలు**

కడప నగరం శ్రీ లక్ష్మి సత్యనారాయణస్వామి ఆలయంలో శ్రీ క్రోధి నామ ఉగాది పండుగను పురస్కరించుకుని మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. తిరుమల–తిరుపతి దేవస్థానాల హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. తొలుత స్వామి, అమ్మవార్ల మూలమూర్తులతోపాటు ఉత్సవ మూర్తులకు కూడా తిరుమంజన సేవ నిర్వహించి కనుల పండువగా అలంకరించారు. భక్తులందరికీ తీర్థ ప్రసాదాలతోపాటు పండుగ ప్రత్యేక ప్రసాదంగా సంప్రదాయ ఉగాది పచ్చడిని అందజేశారు. సాయంత్రం తిరుమల–తిరుపతి దేవస్థానాల వేదిక్ యూనివర్శిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్, రాయలసీమ ఆగమ సలహాదారు డాక్టర్ కేహెచ్ రాజేష్‌కుమార్ పంచాంగ పఠనం చేసి ఈ సంవత్సరంలోని విశేషాలు, వర్షాలు, వ్యాపారం, ప్రకృతి, రాశుల గమనాలు తదితర అంశాలను వివరించారు. ఆలయ ప్రధాన అర్చకులు విజయ్‌భట్టర్ ఆధ్వర్యంలో భక్తులు సహస్ర నామ పారాయణం నిర్వహించారు.

# తీపి, చేదు కలయికే జీవితం

– వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ కె. సురేష్ బాబు

**కడప కార్పొరేషన్:** రుచుల్లో తీపి, చేదు ఉన్నట్లే జీవితంలో కష్టం, సుఖం ఉంటాయని వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ కె. సురేష్ బాబు అన్నారు. క్రోధి నామ సంవత్సరం ఉగాది పర్వదిన సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సురేష్ బాబు మీడియాతో మాట్లాడుతూ కష్టం వచ్చిందని కృంగిపోకుండా, సుఖంగా ఉన్నామని పొంగిపోకుండా రెండింటినీ సమన్వయం చేసుకుంటూ గడపడమే జీవితమన్నారు. ఉగాది సందర్భంగా ప్రతి ఒక్కరికీ ఆరోగ్యం, ఆనందం, సౌభాగ్యం నెలకొని ప్రతి ఇంటా సంతోషాలు నిండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, టీటీడీ బోర్డు



సురేష్ బాబుకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు

సభ్యులు యానాదయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆర్‌వీ రమణ, ఎల్లారెడ్డి, బి. క్రిష్టారెడ్డి, మల్లికార్జున, రామలక్ష్మణ్‌రెడ్డి, ప్రసాద్, సూర్యనారాయణ, శంకరాపురం సింధు, డా. శివానాయక్, షఫీ, అర్జున్, లక్ష్మీనారాయణ, వెంకట్, చక్రి, 2వ డివిజన్ నాయకులు ఆంజనేయులు, భావానీ, రామక్రిష్ణ, సుదాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

# ప్రారంభమైన ఉత్సవాలు

**కడప కల్చరల్ :** కడప నగరం హౌసింగ్‌బోర్డు కాలనీలోని శ్రీ కోదండ రామాలయంలో ఉగాది నుంచి శ్రీరామ నవమి వరకు వసంత నవరాత్రుల పేరిట ప్రత్యేక కార్యక్రమాలను మంగళవారం ఉగాది పండుగ సందర్భంగా ఘనంగా ప్రారంభించారు. ఆలయ ధర్మకర్త వెంకటరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక భజన బృందం తొలుత ఆలయంలోని శ్రీ సీతారాముల మూలమూర్తులకు, ఉత్సవ మూర్తులకు విశేష అభిషేకాలు, అలంకారం నిర్వహించారు. అనంతరం వేద పండితులు చక్రవర్తుల నాగాంజనేయశర్మ పంచాంగ పఠనం చేశారు. నిర్వాహకులు ఆయనను సత్కరించారు. శ్రీ సీతారామ లక్ష్మణుల



విశేష అలంకారంలో శ్రీ సీతారామ లక్ష్మణులు

ఉత్సవ మూర్తులను ప్రత్యేక పీఠంపై కొలువుదీర్చి విశేష పూజలు, గ్రామోత్సవం నిర్వహించారు.

### శిల్పారామంలో..

**కడప కల్చరల్:** కడప శిల్పారామంలో శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. వేద పండితులు చక్రవర్తుల నాగాంజనేయశర్మ ఈ సందర్భంగా ఈ సంవత్సరం పంచాంగాన్ని పఠించి భవిష్య ఫలాల గురించి వివరించారు. శిల్పారామం ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది, ఇతర అధికారులు శిల్పారామం క్యాలెండర్లను ఆవిష్కరించారు. అనంతరం నగరానికి చెందిన వర్షిణి డ్యాన్స్ అకాడమి చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. శిల్పారామం పాలనాధికారి టి.శివప్రసాద్‌రెడ్డి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు

### ఘన సన్మానం

**కడప అర్బన్:** జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీదేవి ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా జడ్జి బంగళా ఆవరణంలో ఉగాది వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు న్యాయశాఖ ఉద్యోగులను జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీదేవి ఘనంగా సన్మానించారు. ఉద్యోగి శివశంకర్ చేసిన సుందరకాండ పారాయణం అందరినీ అలరించింది. ఈ కార్యక్రమంలో కోర్టు సిబ్బంది డి.భాస్కర్, నారపురెడ్డి, నాగరాజు, అహ్మద్‌బాషా, గుప్తా, నాగమునిస్వామి పాల్గొన్నారు.



న్యాయశాఖ ఉద్యోగులను సన్మానిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి దంపతులు

# వరాల వసంతం వచ్చేస్తోంది

- మార్కెట్లకు రంజాన్ కళ
- కొనుగోలుదారులతో దుకాణాలలో రద్దీ
- ఉట్టిపడుతున్న ఆధ్యాత్మిక వాతావరణం

**కడప కల్చరల్ :** పవిత్ర రంజాన్ పండుగకు కేవలం ఒక్కరోజు మాత్రమే గడువు ఉంది. ఇప్పటికే పండుగ నిర్వహణ కోసం వస్తువులు కొనుగోలు చేస్తున్న ముస్లింలతో ప్రధాన మార్కెట్లు సందడిగా మారాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో దాదాపు దుకాణాలన్నీ మహిళలతో నిండిపోతున్నాయి. మార్కెట్ ప్రధాన వీధులు కూడా జనసందోహంతో కనిపిస్తున్నాయి.

**పవిత్ర మాసం..**

మనిషిని ఉన్నతుడిగా తీర్చిదిద్దే మాసం.... ఆత్మార్పణతో అల్లాహ్‌కు దగ్గరయ్యే అవకాశం గల మాసం. దివ్య గ్రంథం ఖురాన్ భువికి దిగిన మాసం. ప్రతి ముస్లిం జీవితంలో పట్టలేని ఆనందం కలిగించే మాసం. నెల రోజులపాటు ఆధ్యాత్మిక చింతనతో గడిపే అవకాశం కల్పించిన మాసం...రంజాన్. సంవత్సర కాలంపాటు ముస్లింలు ఎంతో ఆత్రంగా ఈ పండుగ కోసం ఎదురుచూస్తారు. అలాంటి ఆనందకరమైన రోజు వరాల వసంతాలను కురిపించే రోజు పవిత్ర రంజాన్ పండుగ 24 గంటల్లో రానుంది. దీని కోసం భక్తుల నెల రోజుల నిరీక్షణ ముగియనుంది.

**మార్కెట్లలో రద్దీ ..**

రంజాన్ పండుగ నిర్వహణ కోసం కొనుగోలు



దుకాణాల్లో కొనుగోలుదారుల రద్దీ

చేసేందుకు వచ్చే భక్తులతో మార్కెట్లు కళకళలాడుతున్నాయి. ముఖ్యంగా జిల్లా కేంద్రమైన కడప నగరంలోని వైవీ స్ట్రీట్‌లో ప్రతిరోజు ఉదయం 9 గంటల నుంచే కొనుగోలుదారుల రద్దీ కనిపిస్తోంది. దుకాణదారులు రాత్రి 11 గంటల వరకు కూడా షాపులు తెరిచి పెట్టుకోవాల్సిన అవసరం ఏర్పడింది. వైవీస్ట్రీట్ ప్రధాన రోడ్డు పూర్తిగా ముస్లిం మహిళలే కనిపిస్తున్నారు. ముఖ్యంగా ఒకవైపు పండుగ నిర్వహణ కోసం ప్రత్యేక సామాగ్రి, మరోవైపు ఇంటిల్లిపాదికి దుస్తులు, పాదరక్షలు కొనుగోలు చేస్తున్నారు. మరీ ముఖ్యంగా రెడీమేడ్ దుకాణాలలో జనం కిటకిటలాడుతున్నారు. ముఖ్యంగా సెంటు, అత్తరు దుకాణాలు, మెహందీ విక్రయించే దుకాణాలు, సేమియా దుకాణాల వద్ద సందడిగా ఉంది.

**పండుగ కళ ..**

జిల్లాలోని ముస్లింలు ఎక్కువగా ఉన్న ప్రాంతాలన్నీ



వైవీ స్ట్రీట్‌లో సందడి

క్రమంగా పండుగ కళను సంతరించుకుంటున్నాయి. రాయచోటి, కమలాపురం, రాజంపేట, ప్రొద్దుటూరు, బద్వేలు తదితర ప్రాంతాలలో మసీదులు, ఈద్గాలకు కొత్త కళ కల్పిస్తున్నారు. బడీరాత్‌తో జిల్లాలో రంజాన్ సందడి ప్రారంభమైంది. ముస్లింలలో భక్తిశ్రద్ధలతోపాటు కొత్త ఉత్సాహం కనిపిస్తోంది. ప్రధాన మార్కెట్లతోపాటు ఇతర మెయిన్‌రోడ్డులోగల దుస్తుల దుకాణాలు కళకళలాడుతున్నాయి. మరోవైపు నిత్యావసర సరుకులు విక్రయించే దుకాణాలలో రద్దీ అలాగే ఉంది. పండ్ల దుకాణాలు, తోపుడు బండ్లపై పండ్లు విక్రయించే ప్రాంతాలలో కూడా రద్దీ కనిపిస్తోంది. హలీం, తదితర ప్రత్యేక ఇస్లామిక్ వంటకాలు విక్రయించే దుకాణాలు రంగురంగుల విద్యుద్దీపాలతో కళకళలాడుతున్నాయి. పలుచోట్ల మసీదులను సైతం విద్యుద్దీపాలతో కనుల పండువగా అలంకరించారు.

### ఇఫ్తార్ విందులతో పరమత సహనం

– డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

**కడప కార్పొరేషన్:** ఇఫ్తార్ విందులతో పరమత సహనం అలవడుతుందని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా అన్నారు. మంగళవారం స్థానిక 33వ డివిజన్‌లోని మసీద్ ఏ బుర్హానుద్దీన్‌లో స్థానిక డివిజన్ ఇన్‌చార్జి షేక్ గౌస్‌బాషా, పవర్ అల్తాఫ్‌ల ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు నిర్వహించారు. కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఉపవాస దీక్షలు విరమించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేయడం మంచి సాంప్రదాయమన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వాహిద్ అలీ, అమీర్‌జాన్, జహీర్, షామీర్, ఇమ్రాన్, సుభాన్ బాషా, సుబ్బారెడ్డి, షఫీ, అజ్మతుల్లా, రమేష్‌రెడ్డి, మియ్యా జమీల్, మున్నా పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

### ప్రజా శ్రేయస్సే కవుల లక్ష్యం



కవులను సన్మానిస్తున్న నిర్వాహకులు

**ప్రొద్దుటూరు కల్చరల్:** కవులు సామాజిక అంశాలను రచించి ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా కృషి చేయాలని కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు గ్రహీత డీకే చదువులబాబు సూచించారు. స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్‌లోని గ్రంథాలయంలో క్రోధినామ సంవత్సర ఉగాది సందర్భంగా రామరాజభూషణ సాహితీ పీఠం ఆధ్వర్యంలో కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకవులు ప్రకృతి అందం, స్వచ్ఛత, ఓటు ప్రాముఖ్యత, సామాజిక బాధ్యతలపై రచనలు చేసి ప్రజలను చైతన్య పరచాలని పిలుపునిచ్చారు. క్రోధినామ సంవత్సరంలో క్రోధ భావం లేకుండా కుటుంబసభ్యులతో పాటు ఇరుగు పొరుగు వారితో సఖ్యతగా మెలగాలన్నారు. రామరాజభూషణ సాహితీ పీఠం నేటి తరానికి సాహిత్యాన్ని పరిచయం చేయడమే లక్ష్యంగా పనిచేస్తుందని కొనియాడారు. కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులను ఈ సందర్భంగా శాలువ కప్పి సత్కరించారు. కార్యక్రమంలో కవులు పల్లా వెంకట రామారావు, కాశీవరపు వెంకట సుబ్బయ్య, పుత్తూరు సుబ్రహ్మణ్యం, అనిల్, శివ, గణపతి, వెంకటేశ్వర్లు, కామనూరు రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# దైవ సేవలో తరించిన పాస్టర్ మత్తయ్యబాబు

**కడప కల్చరల్ :** కడప నగరంలోని సీఎస్ఐ క్రైస్ట్ చర్చి పాస్టర్ మత్తయ్యబాబు సుదీర్ఘకాలంపాటు క్రైస్తవ గురువుగా దైవ సేవలో తరించారని సీఎస్ఐ రాయలసీమ డయాసిస్ బిషప్ రైట్ రెవరెండ్ ఐజాక్ వరప్రసాద్ కొనియాడారు. క్రైస్ట్ చర్చి పాస్టర్ మత్తయ్యబాబు మంగళవారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా సీఎస్ఐ సెంట్రల్ చర్చిలో ఆయనను బిషప్‌తోపాటు క్రైస్తవ ప్రముఖులు, విశ్వాసులు పెద్ద ఎత్తున హాజరై ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బిషప్ ఐజాక్ వరప్రసాద్ మాట్లాడుతూ రాయలసీమలోని పలు చర్చిలలో 40 సంవత్సరాలకుపైగా దైవ సేవకుడిగా, నిబద్ధతగల పాస్టర్‌గా తన పరిధిలోని చర్చిలలో దైవ సేవకుడిగా ఎంతో పేరు గడించారని, ఎంతో సాత్వికుడిగా, వివాద రహితుడిగా ఆయనకు మంచి పేరుందన్నారు. ఈ సందర్భంగా రాయలసీమ పరిధిలోని ఆయన సేవలు అందించిన చర్చిలకు సంబంధించిన ప్రముఖులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. తనకు సుదీర్ఘకాలం దైవ సేవచేసే అవకాశం లభించడం అదృష్టంగా భావిస్తున్నామని, అందరి సహకారంతోనే తాను ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా కర్తవ్య నిర్వహణ చేయగలిగామని, విశ్రాంత జీవితాన్ని ప్రశాంతంగా గడుపుతామని పాస్టర్ మత్తయ్య బాబు అన్నారు.



పాస్టర్ మత్తయ్యబాబు దంపతులను సత్కరిస్తున్న బిషప్ ఐజాక్ వరప్రసాద్

# వైభవంగా కొండ గంగమ్మ తిరునాల ఉత్సవాలు



ప్రత్యేక అలంకరణలో ఉన్న కొండగంగమ్మ అమ్మవారు

**పెండ్లిమర్రి :** ఉగాది పండుగను పురస్కరించుకొని మండలంలోని నందిమండలం గ్రామ సమీపంలో వెలసిన కొండ గంగమ్మ తిరునాల ఉత్సవాలు మూడవ రోజు మంగళవారం వైభవంగా నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి కాయ కర్పూరాలతో మొక్కులు తీర్చుకున్నారు.



నందిమండలం కొండ గంగమ్మ వద్ద బండలాగుతున్న ఎద్దులు

**రసవత్తరంగా బండలాగుడు పోటీలు**

తిరునాల సందర్భంగా ఆలయ కార్యనిర్వాహకులు బండలాగుడు పోటీలను ఏర్పాటు చేశారు. పోటీలు రసవత్తరంగా సాగాయి. పోటీలకు 13 జతల ఎద్దులు పాల్గొన్నాయి. పోటీలో గెలుపొందిన వారికి ఆలయ కమిటి సభ్యులు బహుమతులు అందజేసి అభినందించారు.

IndusInd Bank - CFD
COMMERCIAL VEHICLES FOR SALE
ASHOK LEYLAND 2518 TIPPER
2016 MODEL AP37 TE 7596
Cell : 99594 54931
# W-14-245, 1st Floor, IVR Towers, Beside Sai Baba School, ITI Circles, KADAPA.

IndusInd Bank - CFD
COMMERCIAL VEHICLES FOR SALE
1) EICHER 480 DI 42HP 2022 MODEL AP39 UD 2690
2) MM 415 XP PLUS HI SPEED LT SUT SPC PS 42 HP 2023 MODEL AP39 SW 2442
3) M&M 275 OLD BP 39.5 HP 2023 MODEL AP40 C 1154
4) MF 241DI PLANETARY DRIV 2023 MODEL AP39 EM 8355
Cell : 96760 45410
D. No. W-14-245, 1st Floor, IVR Towers, Beside Sai Baba School, ITI Circle, KADAPA.

# ఇఫ్తార్ విందు పుణ్యకార్యం

**కమలాపురం :** పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాసాలు పాటించే ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం పుణ్యకార్యం అని ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు సాయినాథ శర్మ, సంబటూరు ప్రసాద్‌రెడ్డి, ఉత్తమారెడ్డి తెలిపారు. స్థానిక బీడీ కాలనీలో వైఎస్సార్ సీపీ మైనార్టీ జిల్లా వైస్ ప్రెసిడెంట్ జిలాన్ బాషా ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు వారు హాజరయ్యారు. ఉపవాసాలు పాటించిన ముస్లిం సోదరులకు స్వయానా వారు ఖర్జూర పండ్లు అందించి ఉపవాసాలు విరమింపజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రం అంతా చల్లగా ఉండాలంటే జగనన్న ప్రభుత్వం తిరిగి రావాలన్నారు. వేర్ హౌస్, హజ్ హౌస్ చైర్మన్లు కరీముల్లా, గౌస్ లాజమ్, మైనార్టీ కమీషన్ స్టేట్ మెంబర్ హిదా యత్, ఎన్‌సీ పుల్లారెడ్డి, మహ్మద్ సాదిక్, శ్రీనివాసరెడ్డి, మోహన్ రెడ్డి, చెన్నకేశవరెడ్డి, గఫార్, షావలి, ఖాజా హుసేన్ తదితరులు పాల్గొన్నారు.



ఇఫ్తార్‌లో దువా చేస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి

